


శ్రావణ మాసపు సాయంకాలం. కొద్దిగా మబ్బుపట్టి వున్నా, ఉక్క పోతగా వుంది. మోహన్, ప్రసాద్, చిరంజీవి, కుమార్ రోడ్డుమీద నడుస్తున్నారు. వాళ్ళందరూ ఒకే ఆఫీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు.

మోహన్‌కి ఆ ఊరు కొత్తగా ట్రాన్స్‌ఫరయింది. అతను ఆ ఊరు వచ్చి వారమే అయింది. అతను కూడా ఈ మిత్రులతో కలిసి తిరుగుతున్నాడు — ఆఫీస్‌లోను, ఊళ్ళోను పరిచయాలు పెంచుకోవాలన్న ఉద్దేశ్యంతో. కొత్త కావడంచేత తను తక్కువగా మాట్లాడుతూ, వాళ్ళు మాట్లాడేది ఎక్కువగా వింటున్నాడు. ఆ సాయంత్రం పూట కాలక్షేపంగా రోడ్డున పడ్డారు మిత్రులు.

శ్రావణ మంగళవారం పేరంటాలకు వెళ్ళి వచ్చే ముత్తయిదువులతో, కన్నెపిల్లలతో రోడ్డు కళకళలాడుతూంది. అంతవరకు గడగడ మాట్లాడేస్తున్న చిరంజీవి హఠాత్తుగా ఆగిపోయాడు. రోడ్డుమీద తమకు బాగా సమీపంలో ఎదురుగా వస్తున్న ముగ్గురు ఆడవాళ్ళలో ఒక యువతికేసి చూపిస్తూ చెప్పాడు.

"ఒరేయ్, ప్రసాద్! అలా చూడండి! ఆ నీలం చీర కట్టుకున్న అమ్మాయిని చూశావా? ఆమె నాకు బాగా తెలుసు."

ఆ మాటలకు చిరంజీవి కేసి ఉత్సుకతగా చూశారు మిగిలిన వారు ముగ్గురూ.

"ఆ బ్యూటీ నీకు తెలుసా? ఎలా?" ప్రశ్నించాడు కుమార్.

"ఎలా ఏమిటి? తెలియడమంటే అలా, ఇలా కాదు. పూర్తిగా తెలుసు" అని మిత్రుల వైపు చూసి కన్ను కొట్టాడు చిరంజీవి.

"అంటే?" ఆశ్చర్యంగా అన్నాడు మోహన్.

"అంటే — ఏమిటి బ్రదర్? నువ్వు కొత్తవాడివి. నీకేం తెలీదు. ఆ అమ్మాయిని నేను ఓ చూపు చూశాను" గర్వంగా చెప్పాడు చిరంజీవి.

"నిజంగానా? ఆ అమ్మాయి మీకెక్కడ పరిచయం?" కుతూహలంగా చిరంజీవిని ప్రశ్నించాడు మోహన్.

"ఈ ఊళ్ళోనే. కాలేజ్‌లో నేను డిగ్రీ చదువుతున్నప్పుడు ఆ చిలక నాకు జూనియర్. మేమిద్దరం అప్పట్లో మన్మథ సామ్రాజ్యాన్ని ఏలామనుకో. తను డిగ్రీ పూర్తిచేసేదాకా కూడా మా శృంగార లీలలు సాగుతూనే వున్నాయి. కాస్త, కూస్త పరిచయం కాదు మాది. మూడేళ్ళ స్నేహం. అలా ఆడపిల్లల్ని పడగొట్టడంలో ఎవరైనా నా తర్వాతే, తెలుసా? మనమంటే ఏమనుకున్నావు? రసిక సామ్రాట్ హహ్హా!" గర్వంగా కాలర్ సవరించాడు చిరంజీవి. నవ్వుతూ అన్నాడు మళ్ళీ అతనే. "ఏమిటలా తెల్లబోతున్నావు? ఇదొక్కటే కాదోయ్! నా సంగతి మన వాళ్ళనడుగు తెలుస్తుంది, మనకెంత చరిత్ర వుందో!" తనకేసి విస్మయంగా చూస్తూ తన మాటలు వింటున్న మోహన్ భుజం మీద చరిచి, ఎడంచేత్తో మీసం దువ్వాడు చిరంజీవి.

* * * *

మర్నాడు సాయంకాలం—

"రండి సార్! ఇదే మా ఇల్లు. లోపలికి రండి" అంటూ మిత్రులు ముగ్గురినీ ఆఫీస్ నుంచి నేరుగా ఇంటికి తీసుకువచ్చాడు మోహన్.

"మీరు కూర్చోండి. నా మిసెస్‌ని పరిచయం చేస్తాను. జస్ట్ మినిట్" అంటూ లోపలికి వెళ్ళాడు మోహన్. చిరంజీవి, కుమార్, ప్రసాద్ — ముగ్గురూ కుర్చీల్లో కూర్చున్నారు.

మోహన్ అతని భార్యతో కలిసి డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు.

"ఇదిగో, ఈవిడే నా మిసెస్. రాజ్యలక్ష్మి. వీరే నోయ్ మా ఫ్రెండ్స్" అంటూ వాళ్ళని పేరు పేరునా పరిచయం చేశాడు మోహన్.

ఆమెను చూసిన ఫ్రెండ్స్ ముగ్గురూ విశ్చేష్టు లయ్యారు. ముఖ్యంగా చిరంజీవి ముఖంలో నెత్తుటి చుక్క లేనట్టు పాలిపోయింది.

"చిరంజీవిగారూ! ఈవిడేనండీ నిన్న మీరు చూపించిన బ్లూ శారీ అమ్మాయి! అఫ్ కోర్స్! మీకిది వరకే పరిచయం కదా! నేను మళ్ళీ పరిచయం చేయ నక్కరలేదు. ఏమంటారు?" అన్నాడు మోహన్.

చిరంజీవి మాట్లాడలేకపోయాడు.

మళ్ళీ మోహనే అన్నాడు. "చిరంజీవిగారూ! ఈవిడ నా భార్యే కాదు, మా మేనమామ కూతురు. తను ఏ ఊళ్ళో, ఏ కాలేజీలో చదివిందో, చిన్నప్పటి నుంచీ నాకు పూర్తిగా తెలుసు... నిన్న మీరు చెప్పిన మాటలు నాలో ఎటువంటి విష ప్రభావమూ చూపకపోవడానికి అది కూడా ఒక కారణం. అదీగాక, ఏదో విని, నమ్మి, భార్యను అనుమానించే నీచుడిని కాకపోవడంవల్ల, మా సంసారం నిలబడింది.

"తను ఈ ఊళ్ళో చదవలేదని తెలిసి నేను మీ మాటలు నమ్మలేదు సరే! ఒకవేళ ఆమె నా మేనమామ కూతురు కాకుండా వుంటే మీరు చెప్పినవి నేను నమ్మి నా భార్యను అనుమానించడానికి ఆస్కారం వుండేది కాదా? అప్పుడు నా బుద్ధి కనుక వక్రంగా మారి వుంటే? నేను విచక్షణ కోల్పోయి వుంటే? అలాగే కనుక జరిగితే మీరు చెప్పిన అబద్ధాలవల్ల ఒక నిండు సంసారం నాశనమై వుండేది కాదంటారా? అలా జరగనందుకు భగవంతుడికి నమస్కరిస్తున్నాను.

"ఈ మధ్యకాలంలో ఆడవాళ్ళ గురించి తేలికగా మాట్లాడడం ఒక ఫ్యాషన్‌గా మారింది. తప్పొప్పులు గుర్తించడం మానేశారు మనుషులు. తన చెల్లెలినో, భార్యనో, కూతురినో చూసి మరొకళ్ళు అదే విధంగా మాట్లాడితే తమకెంత కష్టంగా వుంటుందో ఎవరి మట్టుకు వాళ్ళు ఆలోచించుకుంటే ఆ విధంగా మాట్లాడగలరా ఎవరైనా?

"ముక్కూ మొహం తెలియని, దారిన పోయే ఆడపిల్లని చూపించి, ఆ పిల్లతో తనకి శారీరక సంబంధం వుందని చెప్పుకోవడం పశుత్వమా, రాక్షసత్వమా? ఆ స్వభావాన్ని ఏమనాలి? తనకి ఎంత శృంగార చరిత్ర వుందని చెప్పుకుంటే అంత ఘనంగా వుంటుందని భావించడం ప్రారంభమైంది. మన సంఘం ఎటు పోతోంది? ఇలాగైతే ఏ స్త్రీకి భద్రత వుంటుంది?" మోహన్ ముఖంలో ఆవేదన ప్రస్ఫుటమైంది.

వింటున్న ముగ్గురూ తలలు దించుకుని నిలబడ్డారు. చివరకు అతి కష్టంమీద చిరంజీవి మాటలు కూడదీసుకుని అన్నాడు, "నన్ను క్షమించు మోహన్. నేనేదో గొప్ప రసికుడినని, ప్రతి ఆడదీ నన్ను చూస్తే వెంట పడుతుందని, నాకు చాలా ఘనమైన శృంగారానుభవాలు వున్నాయనీ తెలియజెయ్యడంకోసం ఇలాంటి అబద్ధాలు కల్పించి చెబుతూ వుంటాను నేను. మా వాళ్ళు ఆసక్తిగా వింటుంటారు. కాని నేను నా నోటి దురద కొద్దీ చెప్పిన వాటివల్ల కొన్ని జీవితాలు నాశనమయ్యే అవకాశం వుందని నాకు ఇప్పుడే తెలిసింది. ఇంతవరకు నేను ఈ విషయాన్ని సరదాగా భావించానే తప్ప, ఈ కోణం నుంచి ఆలోచించలేదు. నేను చేసేది ఎంత నీచమో, ఎంత హేయమో ఈ క్షణాన నాకర్థ మవుతోంది. నాలాంటి వాళ్ళు మన ఈనాటి సంఘంలో చాలా మంది వున్నారు. వాళ్ళకి కూడా నా ఈ అనుభవాన్ని వివరించి చెప్పి, నాకు చేతనైనంతవరకు ఈ దురలవాటును మాన్పించడానికి ప్రయత్నిస్తాను. ఈ దౌర్భాగ్యుడిని మీ దంపతులిద్దరూ క్షమించండి" అంటూ మోహన్ చేతులు పట్టుకున్న చిరంజీవి ముఖంలో నిజాయితీ కదలాడింది.